క్లుప్తంగా

కళాకారుల పాత్ర కీలకం



కళాకారులను సన్మానిస్తున్న నిర్వాహకులు

వెదురుకుప్పం : సమాజ అభివృద్ధిలో కళాకారుల పాత్ర కీలకమని సామాజిక సేవా సమితి అధ్యక్షుడు సీతా సుధాకర్ అన్నారు. మండలంలోని సంతబయలు గ్రామంలో రాష్ట్ర భాషా సాంస్కృతికశాఖ సౌజన్యంతో కౌన్సెల్ ఫర్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ సోషల్ సాలిడారిటీ ఆధ్వర్యంలో విశిష్ట సేవలు అందించిన కళాకారులను సత్కరించారు. అనంతరం కళాకారుల సేవలను కొనియాడారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ రాజేశ్వరి, మాజీ సర్పంచ్ పెద్దిరెడ్డి, సంస్థ నిర్వాహకులు సరస్వతి పాల్గొన్నారు.

మాదిగ ఉపకులాలు తరలిరావాలి



ఎమ్మార్పీఎస్ నాయకుల నినాదాలు

గంగాధర నెల్లూరు : మాదిగ ఉపకులాల ఆవేదనను కమిషన్‌కు వివరించేందుకు ఈనెల 21న చిత్తూరుకు తరలిరావాలని ఎమ్మార్పీఎస్, ఎంపీఎస్ అనుబంధ సంఘాల నేతలు పిలుపునిచ్చారు. బుధవారం ఉమ్మడి చిత్తూరు జిల్లా గంగాధర నెల్లూరు నియోజకవర్గ కేంద్రంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తల ముఖ్య నాయకుల సమావేశం తగీరు అశోక్ మాదిగ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి దుద్దు రామకృష్ణ మాదిగ, విశిష్ట అతిథులుగా హాజరైన ఎమ్మార్పీఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి మాటూరు మురళి మాదిగ, చిత్తూరు జిల్లా అధికార ప్రతినిధి సంగీతం అనిల్ కుమార్ మాదిగ సంయుక్తంగా మాట్లాడారు. మాదిగ ఉపకులాల ప్రజలు, సామాజిక న్యాయ సిద్ధాంతాన్ని బలపరిచే ప్రజాస్వామిక వాదులు అందరూ చిత్తూరు జిల్లా కేంద్రానికి చేరుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జీడి నెల్లూరు , పాలసముద్రం ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

అమ్మవారికి వెండి హారం సమర్పణ



వెండి హారాన్ని అందజేస్తున్న నరసింహనాయుడు కుటుంబ సభ్యులు

గంగాధర నెల్లూరు : మండల కేంద్రంలోని శ్రీ అల్లి ఎల్లమ్మ అమ్మవారికి భక్తుడు నరసింహనాయుడు రూ.40 వేల రూపాయల విలువ గల వెండి ఆభరణాన్ని సమర్పించారు. గంగాధర నెల్లూరు మండలం కనికాపురం గ్రామానికి చెందిన నరసింహనాయుడు కుటుంబ సభ్యులతో కలిసి ఆలయ నిర్వాహకులకు అందజేశారు.

క్రికెట్ విజేత మల్లారెడ్డికండ్రిగ



విజేతలతో రామకృష్ణ

విజయపురం: మండలంలో సంక్రాంతి పురస్కరించుకుని మూడు రోజుల పాటు నిర్వహించిన క్రికెట్ పోటీలు బుధవారం ముగిశాయి. మల్లారెడ్డికండ్రిగలో నిర్వహించిన ఈ పోటీలు మొత్తం ఆరు పంచాయతీల జట్లు పాల్గొన్నాయి. ఫైనల్స్‌లో మల్లారెడ్డికండ్రిగ జట్టు విజేతగా నిలిచింది. విన్నర్స్‌కు రూ.5వేలు, రన్నర్స్‌కు రూ.3వేలను మండల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మాజీ కన్వీనర్ రామకృష్ణ అందజేశారు. కార్యక్రమంలో జ్యోతిప్రకాష్, ప్రవీణ్‌కుమార్, త్రినాథ్, నిశాంత్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ జెడ్పీటీసీ వెంకటేష్‌కు నివాళి



వెంకటేష్ మృతదేహానికి నివాళులర్పిస్తున్న విజయానంద రెడ్డి

గంగాధర నెల్లూరు : గంగాధర నెల్లూరు మండల కేంద్రంలోని జీడీ నెల్లూరు దళిత వాడ చెందిన టీడీపీ సీనియర్ నేత మాజీ జెడ్పీటీసీ వెంకటేష్(60) గుండెపోటుతో మృతి చెందారు. ఈ సందర్భంగా వెంకటేష్ మృతదేహానికి చిత్తూరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి విజయానంద రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే థామస్, సీనియర్ నాయకులు ఆనగంటి హరికృష్ణ, వేల్కూరు బాబు రెడ్డి, స్థానిక నాయకులు గుణశేఖర్ రెడ్డి, వైస్ ఎంపీపీ హరిబాబు , పలువురు ప్రజాప్రతినిధులు ఆయనకు నివాళి అర్పించారు.

నగరి: చంద్రమౌళీశ్వర ఆలయంలో పశువులకు పూజలు చేస్తున్న భక్తులు



కీళపట్టు రామాలయం వద్ద సంక్రాంతి భజనలు



చంద్రమౌళీశ్వర ఆలయం వద్ద పొంగళ్లు పెడుతున్న మహిళలు



వైభవంగా సంక్రాంతి వేడుకలు

- కనుమరోజున గోమాతలకు పూజలు
- మహిళలకు ముగ్గుల పోటీలు

నగరి: నగరి మున్సిపల్, మండల ప్రాంతాల్లో మంగళవారం సంక్రాంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని తమ ఇళ్ల ముంగిట రంగవల్లులతో మహిళలు అందంగా తీర్చిదిద్దారు. మహిళలు కొత్త కుండల్లో పొంగళ్లు పెట్టి, సూర్యునికి నైవేద్యం సమర్పించారు. కీళపట్టు రామాలయం, పట్టణంలోని కరకంఠేశ్వరస్వామి ఆలయం, ప్రసన్న ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. బుధవారం పశువుల పండుగను కోలాహలంగా నిర్వహించారు. పశువులను శుభ్రపరచి వాటిని అలంకరించారు. కొత్త గంటలు కట్టి, వాటి కొమ్ములకు రంగులు వేశారు. పూలదండలు వేసి, హారతులు ఇచ్చి మొక్కారు.



పాలసముద్రం : పూజ సామగ్రితో వస్తున్న భక్తులు

కనుమ ప్రాశస్త్యాన్ని తెలిపేలా వీధుల్లో ముగ్గులు వేసి పశువులపై తమ భక్తిని చాటుకున్నారు. కీళపట్టు చంద్రమౌళీశ్వర ఆలయంలో వైభవంగా గోపూజలు చేశారు. యువకులు వీధుల్లో ఉట్లోత్సవం నిర్వహించారు. ఇక, ముగ్గుల పోటీల్లో మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఆలయ నిర్వాహకులు జలగండ సుబ్రమణ్యం, సుబ్రమణి, గణేశ్, అశోక్, తిరునావుక్కరసు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

సంక్రాంతి సంబరాలు

పాలసముద్రం : మండల పరిధిలోని ప్రజలు సంక్రాంతి సంబరాలు వైభవంగా జరుపుకున్నారు. శ్రీకావేరిరాజుపురంలో సంప్రదాయ దుస్తులతో యువకులు పొంగళ్లు పెట్టారు. రాధా రుక్మిణి చిత్రపటాన్ని పుర వీధుల్లో ఊరేగించారు. రాచపాలంలో బాలగురునాధీశ్వర ఆలయ ఆవరణలో పొంగళ్లు పెట్టి నైవేద్యం సమర్పించారు.

సంక్రాంతి

శ్రీరంగరాజ పురం : మండలంలోని ములూరులో ఎస్ఆర్‌వి ధనంజయ రెడ్డి ఆధ్వర్యంలో సంక్రాంతి వేడుకల్లో భాగంగా యువకులకు క్రికెట్ పోటీలు, మహిళలకు ముగ్గుల పోటీలు, కోలాటం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.అనంతరం గెలుపొందిన వారికి బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఇరగాళ్లమ్మ ఆలయ చైర్మన్ శ్రీనివాసులు రెడ్డి , సురేందర్ రెడ్డి , మూలూరు చెరువు చైర్మన్ ఉమాపతి రెడ్డి పాల్గొన్నారు.



పాలసముద్రం : అలంకరణలో బాలగురునాధీశ్వరస్వామి







పాలసముద్రం : సంప్రదాయ దుస్తులతో పొంగళ్లు పెడుతున్న యువకులు, శ్రీరంగరాజ పురం : విజేతలకు కప్‌ను అందిస్తున్న నిర్వాహకులు, నగరి: ప్రత్యేక అలంకరణలో ప్రసన్నాంజనేయస్వామి

ఘనంగా పశువుల పండుగ

విజయపురం : మండల వ్యాప్తంగా పశువుల పండుగను ఘనంగా నిర్వహించారు. ఉదయం పశువులను నీటితో కడిగి, పసుపు, కుంకుమ పెట్టి సుందరంగా అలంకరించారు. పశువుల యజమానులంతా ఒక చోట కలిసి పొంగళ్లు పెట్టారు. కాటమరాజుకు పూజలు చేశారు.

ముగ్గుల పోటీలకు స్పందన

సంక్రాంతి పురస్కరించుకుని మండలంలోని పాతర్కాడులో నిర్వహించిన ముగ్గుల పోటీలకు మహిళల నుంచి విశేష స్పందన లభించింది. రంగు రంగుల ముగ్గులు వేసి, పండుగ విశిష్టతను తెలిపేలా మహిళలు తమ ముగ్గుల నైపుణ్యాన్ని చాటారు.

పుత్తూరు మండలంలో..

పుత్తూరు: పుత్తూరు మండల వ్యాప్తంగా పశువుల పండుగను ఘనంగా నిర్వహించారు. పలు గ్రామాల్లో పశువులను కడిగి, అందంగా అలంకరించి, పూజలు చేశారు. రామసముద్రం పాడిరైతు ఎస్.మహేశ్వరరావు పలు పశువులకు పూజలు చేసి ప్రసాదం పెట్టారు.



పుత్తూరు: పూజలు చేస్తున్న రైతు మహేశ్వరరావు



పాతర్కాడులో ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

భక్తిప్రపత్తులతో మకరజ్యోతి పూజలు

నగరి: పట్టణ పరిధి బైపాస్ సర్కిల్ వద్ద ఉన్న అయ్యప్పస్వామి ఆలయం, కరకంఠేశ్వరస్వామి ఆలయ ప్రాకారంలోని అయ్యప్పస్వామి ఆలయం, సత్రవాడ అయ్యప్ప స్వామి ఆలయం, కీళపట్టు అయ్యప్పస్వామి ఆలయంలో మంగళవారం మకర జ్యోతి పూజలు భక్తిప్రపత్తులతో నిర్వహించారు. అయ్యప్ప స్వామి, విఘ్నేశ్వర, సుబ్రమణ్యస్వామి విగ్రహాలను, పదునెనిమిది మెట్లను పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. అఖండ దీపం వెలిగించి పూజలు చేశారు. అఖండ దీపంతో ఆలయ ప్రాకారాలను చుట్టి వచ్చారు. భక్తులకు ఆలయ నిర్వాహకులు అన్నదానం చేశారు. రాత్రి అయ్యప్ప, విఘ్నేశ్వర, సుబ్రమణ్యస్వామి విగ్రహాలను విద్యుత్ దీపాలంకరణ, బాణసంచా మోత నడుమ పట్టణ పరిధిలో ఊరేగించారు. కొబ్బరికాయలు కొట్టి కర్పూర నీరాజనాలు సమర్పించారు.



రాజాలంకారంలో అయ్యప్పస్వామి



బైపాస్ సర్కిల్ వద్ద అయ్యప్ప ఆలయంలో జ్యోతిపూజలు చేస్తున్న భక్తులు

క్రీడలతో మానసికోల్లాసం

పాలసముద్రం : క్రీడా పోటీలతో మానసిక ఒత్తిడిని దూరం చేసుకోవచ్చని పారిశ్రామిక వేతలు గిరిరాజు తెలిపారు. మండలంలోని బలిజకండ్రిగ సమీపంలో సంక్రాంతి పండుగ పురస్కరించుకుని నిర్వహించిన కేసీఎల్ క్రికెట్ టోర్నమెంట్ గురువారం ముగిసింది. మూడు రోజులుగా మండల, తమిళనాడు సరిహద్దుల్లోని 16 జట్లు కేసీఎల్ క్రికెట్ పోటీల్లో పాల్గొన్నారు. తిరుమళరాజుపురం గ్రామానికి చెందిన యువకులు గెలుపొందగా వారికి లక్ష రూపాయల చెక్, బహుమతిని అందించారు. రన్నర్‌గా వచ్చిన కోదండరామపురం గ్రామానికి చెందిన క్రికెట్ జట్టుకు రూ.60 వేల చెక్ ను నిర్వాహకులు అందించారు.



రన్నర్, విన్నర్‌గా వచ్చిన జట్టుకు కప్, నగదు చెక్ అందుకుంటున్న యువకులు

గంగమ్మా.. దీవించమ్మా

శ్రీరంగరాజపురం : మండలంలోని తయ్యూరు పాయికట్టులో వెలసిన ఆరిమాని గంగమ్మ ఆలయానికి భక్తులు బుధవారం పోటెత్తారు. జిల్లాతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఆలయ ఈఓ తిమ్మారెడ్డి, అధికారులు భక్తులకు సౌకర్యాలు కల్పించారు. మాజీ ఆర్టీసీ వైస్ చైర్మన్, చిత్తూరు నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ ఇంచార్జి విజయానందరెడ్డి కుటుంబ సమేతంగా అమ్మవారిని దర్శించుకున్నారు. సీఐ హనుమంతప్ప, ఎస్ఐ సుమన్ ఆధ్వర్యంలో దాదాపు 100 పోలీసులతో, 30 సీసీ కెమెరాలు ,4 డ్రోన్ కెమెరాలతో పటిష్ఠ బందోబస్తు నిర్వహించారు.



అలంకరణలో అమ్మవారు



భక్తులతో కిక్కిరిసిన ఆలయం



పల్లకిలో శివపార్వతుల విహారం

తవణంపల్లె: కనుమ పండుగ పర్వదినాన్ని పురస్కరించుకొని మండలంలోని అరగొండలో ఉన్న శివాలయంలో బుధవారం ప్రత్యేక ఉత్సవాలు నిర్వహించారు. శివపార్వతులకు అభిషేకాలు చేశారు. ప్రత్యేక అలంకరణతోపాటు పూజలు చేసి, ధూపదీప నైవేద్యం సమర్పించారు. అనంతరం సుగంధ పుష్పాలతో అలంకరించిన పల్లకిలో శివపార్వతులు విహరిస్తూ భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. భక్తులు ఇంటింటా స్వామికి కొబ్బరికాయలు కొట్టి, కర్పూర, మంగళహారతులిచ్చి మొక్కులు చెల్లించారు.

‘ముక్కనుమ’కు ముస్తాబు

- నేడు కొండచుట్టు మండపం వద్దకు విచ్చేయనున్న దేవతలు

నగరి : నగరి పట్టణంలో ప్రతి ఏటా కనుమ పండుగ మరుసటి రోజు గిరిప్రదక్షిణ ఉత్సవాలు వైభవంగా నిర్వహించడం ఆనవాయితీ. ఈ ఉత్సవాలకు వందల సంవత్సరాలకు ఘన చరిత్ర ఉందని పూర్వీకులు చెప్పడం కద్దు. జిల్లాలో మరెక్కడా లేని విధంగా 21 దేవతల ఉత్సవ మూర్తులు ఊరేగింపుగా కొండచుట్టు మండపం వద్దకు చేరుతాయి. ఈ ఉత్సవాలను పురస్కరించుకుని నిర్వాహకులు మండపానికి రంగులు వేసి ముస్తాబు చేశారు. మండపం చుట్టూ క్యూలైన్లు ఏర్పాటు చేశారు. పట్టణానికి చుట్టూ ఉన్న కొండలు, చుట్టూ ఉన్న ఆలయాల నుంచి ఉత్సవమూర్తులు కొండను చుట్టుకుని నగరికి చేరుకుంటారు. అందుకే ఈ ఉత్సవాలను కొండచుట్టు ఉత్సవాలుగా పిలుస్తారు. చింతలపట్టెడ రోడ్డు మలుపు వద్ద జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న మండపం వద్దకు దేవతలు వచ్చి చేరుతారు. ఈ కారణంగా ఈ మండపాన్ని కొండచుట్టు మండపంగా పేరొంది. పూర్వం ఈ ఉత్సవాలు నిర్వహించడానికి సాలువ రాజులు మండపం నిర్మించారు. మండపంలో విఘ్నేశ్వర స్వామిని ప్రతిష్ఠించారు. వారి పాలన తరువాత కార్వేటినగరం జమీందార్లు, తదనంతరం పాళేగాళ్లు మండపాన్ని సందర్శించారు. ప్రస్తుతం ఉత్సవాలకు కూడా పాళేగార్ల వంశస్థులే ఆధ్వర్యం వహిస్తున్నారు. పట్టణంలోని కరకంఠేశ్వరస్వామి సంక్రాంతి పండుగకు దేవతలను ఆహ్వానిస్తారని, ఆయన ఆహ్వానం మేరకు కొండల చుట్టూ వున్న దేవతలు మండపం వద్దకు అతిథులుగా విచ్చేస్తారని, అలా వచ్చిన దేవతలు గ్రామ విశేషాలను మాట్లాడుకుంటారని భక్తుల నమ్మకం, విశ్వాసం. ఈ ఉత్సవాలను తిలకించేందుకు ప్రజలు వేల సంఖ్యలో విచ్చేస్తారు. కొండచుట్టు ఉత్సవాలకు ప్రస్తుతం చుట్టుపక్కల గ్రామాలలోని 21 దేవతలు వచ్చి కొలువుదీరుతారు. పూర్వం తిరుత్తణి, పళ్లిపట్టు, పుత్తూరు మార్గాలలో ఉన్న ఆలయాలన్నింటి నుంచి సుమారు 50మంది దేవతామూర్తులు వచ్చేవారు. కాలినడకన దేవతామూర్తులను మోసుకువచ్చేవారు. ఉదయాన్నే బయలుదేరి రాత్రి వేళకు చేరుకునేవారు. ఉత్సవాల అనంతరం మరుసటి రోజు ఉదయాన్నే బయలుదేరి వెళ్లేవారు. ప్రస్తుతం 21 దేవతలు మాత్రమే వస్తున్నాయి. పలు ప్రాంతాల నుంచి వచ్చే వలస వ్యాపారులు ఈ మండపం చుట్టూ దుకాణాలు ఏర్పాటు చేస్తారు. దీంతో ఇక్కడ తిరనాళ్ల సందడి సంతరించుకుంది



ముస్తాబైన కొండచుట్టు మండపం

శాంతిభద్రతలకు విఘాతం కలిగించరాదు

జిల్లా వ్యాప్తంగా ప్రాముఖ్యతను సంతరించుకున్న కొండచుట్టు ఉత్సవాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా ఎవరు ప్రవర్తించినా కఠిన చర్యలు తప్పవు. సంస్కృతి, సాంప్రదాయాలు కాపాడాల్సిన బాధ్యత అందరిపైంది. మద్యం సేవించి గొడవలకు దిగే ప్రయత్నం చేస్తే చర్యలు తప్పవు.

–మహేశ్వర్, నగరి సీఐ

ఘనంగా రేణుకాంబ తిరునాళ్లు

గుడిపాల: మండలంలోని గట్రాళ్లమిట్టలో బుధవారం రేణుకాంబ తిరునాళ్లను ఘనంగా నిర్వహించారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకొని అమ్మవారిని గ్రామ వీధుల్లో ఊరేగించారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేకంగా పూజలు, అభిషేకాలు చేసి మొక్కులు చెల్లించారు. బొమ్మసముద్రంలోని సీతారామ దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామివారిని ఊరేగించారు.